క్లుప్తంగా

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజానగరం: దివాన్ చెరువులోని విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని యూనివర్సిటీ ఫీడర్, శ్రీరామపురం ఫీడర్లకు మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్) నటరాజన్ తెలిపారు. ఈ కారణంగా దివాన్ చెరువులోని పండ్ల మార్కెట్ ఏరియా, సాధు పేట, ఎస్సీ కాలనీ, పాలచర్ల, శ్రీరామపురంలలోని అన్ని రకాల సర్వీసులకు పైసమయంలో విద్యుత్ ఉండదన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గ్రహించాలన్నారు.

వైభవంగా పాశాలమ్మ జాతర


పాశాలమ్మ

సీతానగరం: ముగ్గళ్ల గ్రామ దేవత పాశాలమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న ప్రారంభమైన ఈ కార్యక్రమం 25వ తేదీ వరకూ జరుగుతుంది. దీనిలో భాగంగా ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 10 గంటల వరకూ డప్పుల వాయిద్యాలు, గరగ నృత్యాలతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 18వ తేదీన కాటవరానికి చెందిన అఖిలాండేశ్వరి భజన మండలి వారి కోలాటం, భజన, 21న శ్రీరంగపట్నానికి చెందిన సిద్ధి గౌరీశంకర అఘోరా టీమ్ కార్యక్రమం, 23న శ్రీరంగపట్నానికి చెందిన బాల గౌరీ కాళికా నృత్య మండలి వారి కాళికా నృత్యం, 25న అమ్మవారి పూజ జరుగుతాయి. గ్రామస్తుల సహాయ సహకారాలతో 11 ఏళ్లకు ఒక్కసారి ఈ జాతరను నిర్వహిస్తారు. కాగా.. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి శుక్రవారం పాశాలమ్మను దర్శించుకున్నారు.

ఇంటర్ పరీక్షలకు 20 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు 20 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి.హేమ తెలిపారు. శుక్రవారం ఉదయం జరిగిన మొదటి ఏడాది ఫిజిక్స్-1, ఎకనామిక్స్-1 పరీక్షలకు మొత్తం 273 మంది హాజరుకావాల్సి ఉండగా 261 మంది, మధ్యాహ్నం జరిగిన రెండో ఏడాది ఫిజిక్స్-2, ఎకనామిక్స్-2 పరీక్షలకు మొత్తం 61 మంది హాజరు కావాల్సి ఉండగా 53 మంది హాజరైనట్లు ఆమె తెలిపారు.


కౌలు కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సీతానగరం: మండలంలోని కౌలు రైతులు సీసీఆర్‌సీ (కౌలు కార్డులు) కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో కౌలు వ్యవసాయం చేస్తున్న రైతులు వాటికి అర్హులన్నారు. భూమి యజమాని నుంచి సదరు భూమి వివరాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఫోన్ నెంబరును జతపరిచి ఆయా గ్రామాల్లోని వీఆర్వో, వీఆర్‌ఏలకు అందజేయాలన్నారు. దరఖాస్తులను పరిశీలించిన అనంతరం కౌలు కార్డులు పొందవచ్చన్నారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ఉత్తర్వులు

సీతానగరం: ముగ్గళ్లలోని ఉమా కొమరేశ్వర స్వామివారి ఆలయ ధర్మకర్తల మండలికి సభ్యులుగా ఉండాలనేకునేవారు దరఖాస్తు చేసుకోవచ్చని దేవదాయ, ధర్మదాయశాఖ ఈవో పాటి సత్యనారాయణ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు దేవదాయ, ధర్మదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ నకళ్లను ముగ్గళ్ల శివాలయం, గ్రామ పంచాయతీ కార్యాలయం, సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలోని నోటీసు బోర్డులలో ఉంచామన్నారు. ఉత్తర్వులు జారీ చేసిన 20 రోజుల్లోపు ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులను ఆలయం వద్ద లేదా రాజమహేంద్రవరం ఎండోమెంట్ కార్యాలయం, ఈవోలకు నేరుగా అందించవచ్చన్నారు. ఏడుగురు సభ్యులలో ఒకరు బ్రాహ్మణ, ఒకరు నాయీ బ్రాహ్మణ, మిగిలిన ఐదుగురూ ఇతరులు ఉండవచ్చన్నారు. ఏడుగురి ధర్మకర్తల మండలిలో చైర్మన్‌ను ఎన్నుకుంటారన్నారు.

ఉపాధి పథకం నిర్వహణలో అలసత్వం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్రరెడ్డి

పెదపూడి: మండలంలో 7,500 కుటుంబాలకు ఉపాధి పని కల్పించాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 12వేల మంది కుటుంబ సభ్యులకు పని కల్పించాలన్నారు. 3 లక్షల పని దినాలు కూలీలకు కల్పించాలన్నారు. వ్యవసాయానికి ఉపయోగకరంగా ఉండే విధంగా మట్టి పూడిక తొలగింపు పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీఓ సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి ఊతం..

- నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ
- స్కిల్ హబ్‌లతో ఎంతో ప్రయోజనం
- ఆసక్తి చూపుతున్న యువత
- నేటి నుంచి మహిళలకు కుట్టుశిక్షణ


రాజానగరం స్కిల్ హబ్‌లో డేటా ఎంట్రీ ఆపరేటింగ్‌లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాజానగరం: చదివిన చదువుకు తగిన ఉపాధిని పొందలేక నిరుద్యోగ యువత సతమతమవుతోంది. ఎన్ని డిగ్రీలు చేసినా తగిన నైపుణ్యం లేకుంటే సరైన ఉపాధి, ఉద్యోగావకాశాలు లభించడం లేదు. ఈ నేపథ్యంలో మూడేళ్ల క్రితం మండల, జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు వారికి ఎంతో ఉపయోగపడుతున్నాయి.

స్కిల్ హబ్‌ల ఏర్పాటు

ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ద్వారా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్, జిల్లా కేంద్రంలో స్కిల్ కాలేజీ పనిచేస్తున్నాయి. వీటిలో 8వ తరగతి నుంచి బీటెక్, ఎంటెక్, గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వారికి, వారి ఆసక్తిని బట్టి నిర్ణయించిన కోర్సులలో శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లను జారీ చేస్తున్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో స్కిల్ కాలేజీని బొమ్మూరులో ఏర్పాటు చేయగా స్కిల్ హబ్‌లను అసెంబ్లీ నియోజవర్గాల వారీగా నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరు, రాజమండ్రి రూరల్, రాజమండ్రి అర్బన్, అనపర్తి, రాజానగరాల్లో నిర్వహిస్తున్నారు.


టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు

కోర్సులు ఇవే..

స్కిల్ హబ్‌లలో 18 నుంచి 35 ఏళ్ల వయసున్న నిరుద్యోగ యువతకు వివిధ కోర్సులలో శిక్షణ ఇస్తున్నారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి చదివిన వారికి టైలరింగ్, ఎలక్ట్రికల్ డొమెస్టిక్ సొల్యూషన్స్, అసిస్టెంట్ డెకరేటివ్ పెయింటర్, తదితర వాటిలోనూ, ఇంటర్, డిగ్రీ విద్యార్హత ఉన్న వారికి డేటా ఎంట్రీ ఆపరేటింగ్, జావా, ఎంఎస్ఎస్ ఆఫీస్, మైక్రోసాఫ్ట్ ఆఫీస్, ఎలక్ట్రీషియన్ వర్క్స్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్, హోమ్ హెల్త్ ఎయిడ్ అసిస్టెంట్, ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలప్పర్‌లో శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేస్తున్నారు. ఈ సమయంలో క్యాంపస్ సెలక్షన్స్ ఎక్కడైనా జరుగుతుంటే అర్హత, ఆసక్తి ఉన్న వారిని పంపించి, ఉద్యోగాలు పొందేలా తోడ్పాటు అందిస్తున్నారు. కోర్సును బట్టి కాల వ్యవధి ఉంటుంది. స్కిల్ హబ్‌లో రోజుకు 4 నుంచి 5 గంటలు, స్కిల్ కాలేజీలో 8 గంటల పాటు శిక్షణ ఇస్తున్నారు.

ఎనిమిది బ్యాచ్‌లకు శిక్షణ

నియోజకవర్గ కేంద్రమైన రాజానగరంలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేసి మూడేళ్ల పూర్తవుతోంది. ఇంతవరకు ఈ సెంటర్‌లో డేటా ఆపరేటింగ్, ట్రైలరింగ్‌లలో ఎనిమిది బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. పరిమితంగా శిక్షణ ఇవ్వడం వలన సుమారు 250 మంది వరకు ప్రయోజనం అందుకున్నారు.

నేటి నుంచి శిక్షణ

> రాజానగరం స్కిల్ హబ్ సెంటర్ (కామన్ ప్రొడక్షన్ సెంటర్)లో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన మహిళలకు టైలరింగ్ శిక్షణ శనివారం నుంచి ప్రారంభం కానుంది. 90 రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణకు 164 మందిని ఎంపిక చేశారు. శిక్షణానంతరం వీరందరికీ సర్టిఫికెట్లతో పాటు కుట్టుమెషీన్లు అందజేస్తారు.
> – జేప ఝాన్సీ, ఎంపీడీఓ, రాజానగరం

నైపుణ్యం పెరుగుతుంది

> బీఎస్సీ కంప్యూటర్స్ చదివాను. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. ఈ సమయంలో డేటా ఎంట్రీ ఆపరేటింగ్, ఎక్సెల్‌లో శిక్షణ ఇస్తున్నారని తెలిసి ఇక్కడ చేరాను. ప్రస్తుతం అంతా కంప్యూటర్ మయం. ఏ ఉద్యోగం చేయాలన్నా కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరం.
> – సలాది సుమలత, రాజానగరం

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందివ్వాలి


ఇన్‌లైన్ క్లోరినేషన్ విధానాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో ప్రజలకు సరఫరా చేసే తాగునీటిని తప్పనిసరిగా క్లోరినేషన్ చేసి పిదపే సరఫరా చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. కరకుదురు గ్రామంలో రక్షిత మంచినీటి పథకాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇటీవల ఈ టాంక్ వద్ద వేయించిన ఇన్‌లైన్ క్లోరినేషన్ పనితీరును ఆయన పరీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్‌లైన్ క్లోరినేషన్‌తో మంచి ఫలితాలు వస్తున్నాయని భావించి జిల్లా కలెక్టర్ అన్ని వాటర్ ట్యాంక్‌లకు నీళ్లు తోడే మోటార్ల వద్ద ప్రత్యేక జంక్షన్ బాక్స్‌లు ఏర్పాటు చేశారన్నారు. మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సచివాలయ కార్యదర్శి ప్రసన్నాంజనేయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం అందజేత


బాధిత కుటుంబానికి నగదు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి

పెదపూడి: అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. పెదపూడి గ్రామంలో ఈనెల 14న రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కిలాడి లోవరాజు ఇల్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. బాధిత కుటుంబాన్ని కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ప్రమాదం ఏ విధంగా సంభవించినదీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి పార్టీ శ్రేణులు సమకూర్చిన రూ.10వేల ఆర్థిక సహాయం, 50 కేజీల బియ్యం, వస్త్రాలను కృష్ణారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన పారిశుద్ధ్య కార్మికుడు లోవరాజుకు ప్రభుత్వం తరపున వర్తించే పథకాలు అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, నియోజకవర్గ చేనేత విభాగం అధ్యక్షుడు పప్పు సింహాచలం, పెద్దాడ సర్పంచ్ డొకుబుర్ర మీనాక్షి, పార్టీ నాయకులు కాకర సాయిబాబు, పంపన రమణ, నర్ల శ్రీను, అందుగుల అబ్బు, మార్ని వెంకట్రావు, కొంగర భద్రం, ఇందుగపల్లి కాటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం.. అధైర్య పడొద్దు

- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు
- కార్యకర్తలకు భరోసా
- బొబ్బిల్లంకలో 'నా కార్యకర్తలు – నా కుటుంబం'
- హాజరైన మాజీ హోంమంత్రి వనిత, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా


బొబ్బిల్లంకలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణు, చిత్రంలో తానేటి వనిత, జక్కంపూడి రాజా

సీతానగరం: ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని, ఎవ్వరూ అధైర్యపడొద్దని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బొబ్బిల్లంకలో పార్టీ నాయకుడు మల్లిన చౌదరి నివాసం వద్ద శుక్రవారం 'నా కార్యకర్తలు – నా కుటుంబం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, వేణు, మాజీ హోంమంత్రి వనిత సమావేశమయ్యారు. తొలుత ఈ కార్యక్రమానికి వచ్చిన నాయకులను బొబ్బిల్లంక శివారు నుంచి భారీ ర్యాలీతో ఆహ్వానించారు.

కూటమి ప్రభుత్వంలో దాడులు

మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో దాడులు పెరిగిపోయాయన్నారు. వారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను పట్టించుకోకుండా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయకుండా వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్నారు. గ్రామస్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలోపేతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు నడుం బిగించాలన్నారు. ప్రతిపక్షంలో ఉండి ప్రజల పక్షాన పోరాటం చేయాలన్నారు. మాజీ హోంమంత్రి తానేటి వనిత మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతం, విజయం కోసం అంకితభావంతో పని చేద్దామని పిలుపునిచ్చారు.

ప్రజల పక్షాన..

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రతి నిత్యం ప్రజాపక్షమేనని అన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుపై దృష్టి సారించకుండా కూటమి నాయకులు కేవలం వైఎస్సార్ సీపీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలను పెంచి సామన్య ప్రజలపై భారం మోపారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేస్తామన్నారు. ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు వైఎస్సార్ సీపీకి అండగా ఉన్నారని, రానున్న రోజుల్లో పార్టీ తప్పకుండా అధికారంలోకి వస్తుందన్నారు. పార్టీ పటిష్టతకు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబు, పార్టీ నాయకులు మెల్లిమి రామచంద్రరావు, చల్లమళ్ల సుజీరాజు, మొగలపు శ్రీనివాస్, చిన్నా, దుర్గారావు పాల్గొన్నారు.

మట్టి నమూనా పరీక్షలతో రైతులకు మేలు

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు


రంగంపేటలో పచ్చిరొట్ట సాగుచేసిన పొలాలను పరిశీలిస్తున్న డీఏవో మాధవరావు

రంగంపేట: రైతులంతా తమ పొలాల్లో మట్టి నమూనా సేకరణ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.మాధవరావు సూచించారు. మండల కేంద్రమైన రంగంపేటలోని రైతు సేవా కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న అన్నదాత సుఖీభవ, కౌలు రైతు కార్డులు, మట్టి నమూనా సేకరణ తదితర విషయాలను గూర్చి ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మట్టి పరీక్షలు చేయించుకోవడం వల్ల భూమిలోని పోషక లోపాలను తెలుసుకునే వీలుంటుందని అన్నారు. వాటిని నివారించి సాగు చేసినప్పుడు ఆశించిన ఫలితాలు పొందవచ్చునని అన్నారు. ఏటా ఒకే రకమైన పంటలు వేయడం, ఎవరికి తోచినట్టు వారు సాగు చేయడం, ఇష్టానుసారంగా మందులు, ఎరువులు వినియోగించడం తదితర కారణాలతో వ్యవసాయంలో అనుకున్నంత ఆదాయాన్ని పొందలేక పోతున్నారని అన్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడటం వలన చీడపీడలు ఎక్కువ ఆశిస్తాయన్నారు. దానివల్ల సాగు ఖర్చు పెరుగుతుందన్నారు. భూసారం తగ్గి దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. రంగంపేట మండలానికి 1285 మట్టి నమూనాలు లక్ష్యంగా ఇవ్వగా ఇప్పటి వరకు 1,116 మట్టి నామూనాలు సేకరించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం స్థానిక వ్యవసాయ సిబ్బందితో కలసి రంగంపేట రైతు క్షేత్రాల్లో వ్యవసాయ శాఖ రాయితీపై పంపిణీ చేసిన జీలుగ, పిల్లిపెసర, నవధాన్యాలు వేసిన పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారి వెంకటేష్, వీఏఏ మహేష్, రైతులు పాల్గొన్నారు.

డెంగీని నిర్లక్ష్యం చేస్తే మరణమే


సీతానగరం పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది


రాజానగరంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సీతానగరం: డెంగీ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే మరణం సంభవిస్తుందని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సునీల్ అన్నారు. ఆ పీహెచ్‌సీ వద్ద డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. డాక్టర్ సునీల్ మాట్లాడుతూ డెంగీ వ్యాధి రావడానికి ఈడిస్ అనే దోమ కారమణమని, ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి దోమలు కుట్టడం వల్ల వ్యాపిస్తుందన్నారు. ప్రజలందరూ తమ ఇంటి పరిసరాల్లో, లోపల నీరు నిల్వ లేకుండా చూసుకోవాల్సారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వైఎస్ రాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, స్వరూపా రాణి, నగేష్, ఏఎన్ఎంలు మున్నీషా, సలీమా, కృష్ణవేణి, విశాలాక్షి, సంధ్య, ఆశావర్కర్లు దేవి, రాణి, లలిత, రవళి, విజయ పాల్గొన్నారు.

రాజానగరంలో..

రాజానగరం: జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ రామ్‌భాస్కర్ ఆధ్వర్యంలో గ్రామంలో శుక్రవారం అవగాహన ర్యాలీ జరిగింది. పీహెచ్‌సీ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా సాగింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వలు లేకుండా శ్రద్ధ తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి


బొమ్మూరులో ర్యాలీ నిర్వహిస్తున్న చాందిని తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: కౌమర దశలోని బాలికలు కిశోర వికాసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బొమ్మూరు గ్రామ సచివాలయం -3 మహిళా సంరక్షణ కార్యదర్శి చాందిని అన్నారు. బొమ్మూరు రాఘవేంద్రనగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోర వికాసం అవగాహన సదస్సు నిర్వహించారు. కౌమర దశలో రక్తహీనత అనే అంశంపై ఆమె అవగాహన కల్పించారు.. కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ముందుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఇంటర్వ్యూలు వాయిదా

రాజమహేంద్రవరం రూరల్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నవారికి హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు వాయిదా పడ్డాయి. ఈ విషయాన్ని ఎంపీడీవో డి.శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఇంటర్వ్యూలను తదుపరి ఎప్పుడు నిర్వహించేదీ తెలియజేస్తామన్నారు.

ఉత్సవమూర్తుల గ్రామోత్సవాలకు కాంస్య రథం బహూకరణ


దాతలు బహూకరించిన కాంస్య రథం

అనపర్తి: మండలంలోని కుతుకులూరు గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల్లోని ఆలయాలలో ఉత్సవమూర్తుల గ్రామోత్సవాలు నిర్వహించడానికి వీలుగా కాంస్య రథాన్ని దాతలు బహూకరించారు. దివంగత సత్తి సూర్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి పద్మావతి, కుమారుడు సత్తి వీరవెంకట సత్యనారాయణరెడ్డి(దొరబాబు), సుమ దంపతులు రూ.8లక్షల విలువైన కాంస్య రథాన్ని దేవి ఆలయ కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. చెరువు వద్ద ఉన్న దేవీ ఆలయంలో ఉదయం హోమం నిర్వహించి భారీ అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం నూతన కాంస్య రథంలో డప్పు వాయిద్యాలు, సన్నాయి మేళాలు, కోలాటాల మధ్య అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి దేవేందర్ రెడ్డి, హేమలత దంపతులు, దేవీ ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

- నందడిగా వేసవి క్రీడా శిబిరాలు
- ఆసక్తి చూపుతున్న చిన్నారులు
- వివిధ రకాల క్రీడల్లో శిక్షణ
- అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లో 50 కేంద్రాలు


వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించిన జాహిత గుణ

ప్రకాశం నగర్: వేసవి సెలవులను చిన్నారులు ఉత్సాహంగా, ఉల్లాసంగా గడుపుతున్నారు. తమకు నచ్చిన క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నారు. ఇప్పటి వరకూ చదువులతో కుస్తీ పట్టిన వారందరూ ఇప్పుడు ఆటలపైనా ఆసక్తి చూపుతున్నారు. ఇందుకోసం జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా నగర పరిధిలో సుమారు 20 క్రీడా శిబిరాలు, అర్బన్, రూరల్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 50 సెంటర్లలో శిక్షణ ఇస్తున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఒక కేంద్రం నుంచి కనీసం 25 మంది బాలురు, 25 మంది బాలికలు తమ ఆసక్తిని బట్టి అండర్ – 14 విభాగంలో ఆయా క్రీడల్లో మెళకువలు నేర్చుకుంటున్నారు. నగరంలోని ఎస్‌కేవీటీ క్రీడా మైదానం, ఆర్ట్స్ కళాశాల క్రీడా మైదానం, డీఎంహెచ్ స్కూల్ క్రీడా ప్రాంగణం, స్టేడియం, నన్నయ పాఠశాల క్రీడా మైదానాల్లో ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, హ్యాండ్ బాల్, బాక్సింగ్, క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్‌తో పాటు ఖోఖో, హాకీ, టెన్నిస్ విభాగాల్లో శిక్షణ పొందుతున్నారు. వీరికి ఆయా జిల్లా క్రీడా అసోసియేషన్లు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా శిక్షకులు తర్ఫీదు ఇస్తున్నారు. మే ఒకటిన ప్రారంభమైన ఈ తరగతులు 31వ తేదీ వరకూ కొనసాగుతాయని జిల్లా చీఫ్ కోచ్ డీఎంఎం శేషగిరి తెలిపారు.

జాతీయ పోటీలకు భవ్యశ్రీ


జాతీయ పుట్‌బాల్ పోటీలకు ఎంపికైన భవ్యశ్రీని అభినందిస్తున్న డీఈవో వాసుదేవరావు

నగరంలోని మూడో వార్డు నెహ్రూ నగర్ మున్సిపాల్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కారుమూరి భవ్యశ్రీ ఫుట్‌బాల్ అండర్ -14 విభాగంలో స్కూల్ గేమ్స్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో సత్తా చాటింది. తద్వారా జాతీయ పుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఆ బాలికను ఇటీవల పాఠశాల ప్రాంగణంలో జిల్లా విద్యాశాఖ అధికారి కంది వాసుదేవరావు, అర్బన్ డీఐ బి.దిలీప్ కుమార్ అభినందించారు. అలాగే ఇంపాల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ పోటీల్లో లాలాచెరువు ఎంపీఎల్ కార్పొరేషన్ స్కూల్ విద్యార్థిని జాహిత గుణ వెయిట్ లిఫ్టింగ్‌లో అండర్– 17 బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది.


ఎస్‌కేవీటీ క్రీడా మైదానంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

మానసిక ఉల్లాసం

> క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు, మానసిక ఉల్లాసం చేకూరుతుంది. వేసవి సెలవులో సమయం వృథా కాకుండా విద్యార్థులు వారికి నచ్చిన ఆటలో మెళకువలు నేర్చుకోవాలి. క్రీడల్లో ప్రతిభ కనబరిచేందుకు ఇటువంటి శిక్షణ శిబిరాలు క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడతాయి.
> – కేవీ స్వామి, జిల్లా క్రీడా సమాఖ్య కార్యదర్శి